క్లుప్తంగా

వెండి గంధపు గిన్నె బహూకరణ



పెడన: శ్రీదేవీశరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణ పరిధిలోని శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పది రోజులపాటు లాటరీ నిర్వహించారు. లాటరీలో విజేతలకు చీరలు బహుమతిగా ఇచ్చారు. నవరాత్రుల చివరిరోజు శనివారం రాత్రి నిర్వహించిన లాటరీలో రాయపురెడ్డి కార్తీకమహాలక్ష్మి విజేతగా నిలిచింది. ఈమెకు ఆలయ భక్త బృందం వెండి గంధపు గిన్నెను బహూకరించి అభినందించారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండలం ఆముదార్లంకలో దాతల సహాయంతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మండవ రమాదేవి, ఝాన్సీలక్ష్మి, వేములపల్లి రాఘవేంద్రరావు ఆర్థిక సహాయంతో పునర్నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.85.70 లక్షల వ్యయంతో ఆముదార్లంక గ్రామంలో 17 సీసీ రోడ్లను నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన యువ నేత మండలి వెంకట్రామ్, సర్పంచ్‌లు నడకుదిటి ఆదిలక్ష్మి, పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి వసంతోత్సవం



నాగాయలంక: స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో 32వ వార్షిక శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలకు శనివారం రాత్రి స్వస్తి పలకడంతో ఆదివారం అమ్మవారి వసంతోత్సవం, నిమజ్జనం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తొలుత శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉత్సవ విగ్రహానికి అర్చకుడు కొల్లిపర సుబ్బారావు సంప్రదాయక వసంతోత్సవ పూజలు జరిపి మేళతాళాలతో వసంతం, నిమజ్జన యాత్రకు తరలించారు. ఆరు అడుగుల ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ ట్రాలీపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధులలో ఊరేగింపు జరిపారు. అనంతరం ఫెర్రీ రోడ్డులో విగ్రహాన్ని శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పడవపై ఉంచి కృష్ణానదిలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఆర్యవైశ్య సంఘాల నేతలు చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా శివనాగేశ్వరరావు, సేవాదళ్ ప్రతినిధులు వంకాయల ఆదిరాజేష్, వి.హరీష్‌కుమార్, చిట్టా శేఖర్, ఇతర కార్యకర్తలు గ్రామస్తులు, పాల్గొన్నారు.



మచిలీపట్నంలో లక్ష గాజులతో అలంకారం



వాలంక తూమువద్ద రాజరాజేశ్వరీదేవిగా..



రాజరాజేశ్వరీదేవిగా విశ్వనాథపల్లి నాంచారమ్మ



ప్రత్యేక అలంకారంలో కోడూరు గంగాభవానీ



శ్రీరాజరాజేశ్వరీదేవిగా పెడన పైడమ్మతల్లి



నాగాయలంక కృష్ణానదిలో తెప్పోత్సవం



నాగాయలంక వీధుల్లో సేవాదళ్ గ్రామోత్సవం



మోపిదేవి దేవస్థానంలో శమీవృక్షపూజ



శ్రీకాకుళంలో సారె సమర్పిస్తున్న కమిటీ సభ్యులు



మచిలీపట్నం గీతా మందిరంలో సెమీ పూజ నిర్వహిస్తున్న దృశ్యం



బంటుమిల్లిలో శాంతికల్యాణం

జయహో.. దుర్గా భవానీ!

విజయదశమి పర్వదినాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా పలు ఆలయాల వద్ద శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తూ చివరిరోజున విజయదశమిగా దసరా పర్వదినాన్ని జరుపుకున్నారు. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని ఆయాలు, ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. గాజుల అలంకరణ చేశారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

– మచిలీపట్నంటౌన్/పెడన/అవనిగడ్డ/నాగాయలంక/కోడూరు/ఘంటసాల/మోపిదేవి/బంటుమిల్లి

రూ.30.68 కోట్లతో 496 సీసీ రోడ్ల నిర్మాణం

- నేటి నుంచి 21 వరకూ పల్లెపండుగ
- ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 496 సీసీ రహదారులు నిర్మించనున్నట్టు శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం నుంచి 21వ తేదీ వరకూ పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. అవనిగడ్డ మండలంలో రూ.5.49 కోట్లతో 104 సీసీ రహదారులు, మోపిదేవి మండలంలో రూ.4.73 కోట్లతో 79, చల్లపల్లి మండలంలో 6.69 కోట్లతో 59, కోడూరు మండలంలో రూ.5.25 కోట్లతో 48, ఘంటసాల మండలంలో రూ.3.32 కోట్లతో 49, నాగాయలంక మండలంలో రూ.3.05 కోట్లతో 50 సీసీ రహదారులను నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ నెల 14వ తేదీ నుంచి ఈ రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్టు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే చాలా వరకు రహదారుల సమస్య తీరిపోతుందన్నారు.

హిందూ సంఘటనే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



విజయదశమి ఉత్సవంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బంటుమిల్లి: దాదాపు వంద సంవత్సరాలుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చేస్తున్న కృషి హిందూ సంఘటనే లక్ష్యంగా పనిచేస్తున్నదని సంఘ్ కుటుంబ ప్రభందక్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. 1925 సంవత్సరంలో విజయదశమి రోజున ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రారంభించగా ఈ సంవత్సరంతో వంద సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న క్రమంలో ఉత్సవం నిర్వహించారు. ముఖ్య వక్తగా ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా శిక్షణ పొందిన వ్యక్తులు ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో స్థిరపడి మంచి వ్యక్తిత్వం గల సేవలు అందిస్తున్నారన్నారు. అతిథిగా సిబ్బిశెట్టి రాజ, మండల కార్యవాహ్ ఎంవీ వెంకటరత్నం, పలు గ్రామాల స్వయం సేవకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చంద్రపాల్ కృషి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మచిలీపట్నంటౌన్: ఎల్ఐసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించిన పోరాటాలకు నాయకత్వం వహించిన తాడంకి చంద్రపాల్ చేసిన కృషి మరువరానిదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. చంద్రపాల్ ఉద్యోగ విరమణ అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చంద్రపాల్ కృషి చేశారన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకర్‌బాబు, సీపీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు, ఐసీఈయూ జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిశోర్‌కుమార్ తదితర నాయకులు చంద్రపాల్, స్వర్ణలత దంపతులను సత్కరించారు.

సాయిబాబాకు గోక్షీరాభిషేకం



కోడూరు: సాయిబాబా మహాసమాధి చెందిన పర్వదినాన్ని పురస్కరించుకొని కోడూరు షిర్డీ సాయి దివ్య ధాన్యజ్ఞాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు బాబా విగ్రహానికి గో క్షీరాభిషేకాన్ని కనులపండువగా జరిపారు. భక్తులే స్వయంగా స్వామివారికి అభిషేకం చేసే అవకాశం కల్పించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్ది భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. సాయిబాబా విగ్రహాన్ని ప్రత్యేక పల్లకీలో ఊరేగిస్తూ నగరోత్సవం జరిపారు. వేదపండితుల మంత్రవచనాల నడుమ బాబా పాదుకలకు పంచామృతులతో అభిషేకాలు చేసి, జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు.

సారె సమర్పించిన పోలీసులు

కోడూరు: మండలంలోని పాలకాయతిప్ప గ్రామంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి మెరైన్ పోలీసులు సారెను సమర్పించి భక్తిభావం చాటారు. మెరైన్ సీఐ జిలానీ ఆధ్వర్యంలో సిబ్బంది అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులతో పాటు పండ్లు, పూలను సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని గ్రామస్తులు అన్న సమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మోపిదేవి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విజయదశమి సందర్భంగా శనివారం ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ ఆయుధ పూజ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా దుర్గాదేవికి పలురకాల పిండి వంటకాలు, స్వీట్లు పెట్టి పూజలు చేశారు. అనంతరం పోలీస్ సిబ్బంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయించండి



ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను కలిసిన ఉర్దూ ఉపాధ్యాయ సంఘ నాయకులు

పెడన: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉర్దూ మొదటి భాషగా ఎంచుకున్న విద్యార్థులకు బోధించేందుకు ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని ఉర్దూ ఉపాధ్యాయ సంఘ నాయకులు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదును కోరారు. ఆదివారం నాగేశ్వరరావుపేటలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉర్దూ పాఠశాలలు అప్‌గ్రేడ్ అయ్యాయని విద్యార్థుల సంఖ్య పెరిగినా ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయలేదన్నారు. అవసరమైన పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులను ఎజీటీలు, స్కూలు అసిస్టెంట్లుగా నియమించడానికి కృషి చేయాలని సంఘ నాయకులు కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో మీర్జఆలీరాజా, మహ్మద్ఈసా, మహ్మద్ ఇస్మాయిల్, నున్న రాంబాబు, మహ్మద్ఇక్రాన్‌పాషా, సమీఖాన్, మీర్‌ఇస్మాయిల్, అబ్దుల్‌ఖయ్యూం, మస్తాన్‌బీ తదితరులు ఉన్నారు.

సముద్రపు స్థితిగతులపై అవగాహన



తీరంలో పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న సీఐలు యువకుమార్, సురేష్‌రెడ్డి

కోడూరు: సముద్ర స్థితిగతులపై పర్యాటకులకు పోలీసులు అవగాహన కల్పించారు. అవనిగడ్డ సీఐ యువకుమార్, పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్ రెడ్డి ఆదివారం హంసలదీవి సాగరతీరాన్ని పరిశీలించారు. పాలకాయతిప్ప బీచ్ వద్ద సముద్ర స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులకు జాగ్రత్తలు చెప్పారు. తుఫాన్లు, వాయుగుండాల ప్రభావంతో సముద్రంలో భారీగా గుంతలు ఏర్పడి, ఇసుక తీరానికి కొట్టుకువచ్చిందని సీఐలు చెప్పారు. ఇసుక ఒడ్డుకు చేరడంతో గుంతల్లో పడి పర్యాటకులు ప్రమాదాలు బారిన పడుతున్నారన్నారు. పోలీసుల సూచనలు పాటిస్తూ యాత్రికులు స్నానాలు ఆచరించాలని సీఐలు కోరారు. అనంతరం లౌడ్‌స్పీకర్లతో అవగాహన కల్పించారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శక్తిపటాల ఊరేగింపులో ఘర్షణ

- లాఠీచార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు
- ఆర్‌పేట స్టేషన్‌లో కేసు నమోదు

కోనేరుసెంటర్: శక్తిపటాల ఊరేగింపులో అపశృతి చోటుచేసుకుంది. స్వల్ప వివాదంతో రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఒకరిని ఒకరు దూషించుకుంటూ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఓ వర్గంలోని ముగ్గురికి గాయాలు అయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. దసరా నవరాత్రులను పురస్కరించుకుని శనివారం మచిలీపట్నంలోని కోనేరుసెంటర్‌లో జమ్మి కట్టు ఊరేగింపులు జరిగాయి. ఈ ఊరేగింపుల్లో భాగంగా రుస్తుంబాదకు చెందిన వర్గం, బలరామునిపేటకు చెందిన వర్గం ఒకే చోట ఎదురెదురు అయ్యాయి. దీంతో యువకుల మధ్య స్వల్ప వివాదం రేగింది. ఈ వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో రెండు వర్గాల వారు కొట్లాటకు దిగారు. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో రుస్తుంబాదకు చెందిన ముగ్గురికి గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ప్రయోజనం లేకపోవటంతో లాఠీలకు పనిచెప్పారు. లాఠీచార్జ్ చేసి గలాటాకు కారకులైన వారందరినీ అక్కడి నుంచి చెల్లాచెదురు చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రుస్తుంబాదకు చెందిన క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆర్‌పేట పోలీసులు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు మార్జిన్ ఆక్రమణ

పట్టించుకోని మునిసిపల్ అధికారులు



భాస్కరపురంలో ఆక్రమణకు గురైన స్థలం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 12వ డివిజన్ భాస్కరపురంలో టీడీపీ నాయకుల కనుసన్నల్లో ఆక్రమణల పర్వం ప్రారంభమైంది. దసరా సెలవులు కావటంతో ఇదే అదునుగా భావించిన వారు ఆ ప్రాంతంలోని వినాయకుడి గుడి ఎదురుగా మునిసిపల్ స్కూల్ ప్రహరీ వెంబడి రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించేందుకు పూనుకున్నారు. ఆ ప్రాంతంలో పరదాను కట్టి ఆక్రమణకు తెరలేపారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని ఆ ప్రాంతవాసులు మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు టీడీపీ నాయకులు సన్నాహాలు ప్రారంభించారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి టీడీపీ నాయకుల ఆక్రమణలపర్వాన్ని నివారించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

రూ.లక్ష విలువైన టపాసులు స్వాధీనం

పెడన: పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంలో అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి మందుగుండు సామగ్రిని పోలీసులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సత్యన్నారాయణ తెలిపిన సమాచారం మేరకు.. లైసెన్స్ లేకుండా సుమారు రూ.లక్షకు పైగా విలువ కలిగిన దీపావళి మందుగుండు సామగ్రిని నిల్వ ఉంచారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు చేసి టపాసులను స్వాధీనం చేసుకుని కే. బాలనాగరాజు, ఎస్.మహేష్‌లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రేపు మద్యంషాపుల కేటాయింపునకు లాటరీ

ఘంటసాల: మద్యం షాపులకోసం దరఖాస్తు చేసుకున్న వారిని మంగళవారం లాటరీ ద్వారా ఎంపిక చేస్తారని మొవ్వ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.వరాల రాజు తెలియజేశారు. ఆ రోజు ఉదయం ఉదయం 8 గంటలకు మచిలీపట్నం హిందూ కాలేజీ ప్రాంగణంలో లాటరీ నిర్వహిస్తారని తెలిపారు. మొవ్వ సబ్ డివిజన్ పరిధిలోని ఘంటసాల, చల్లపల్లి, మొవ్వ మండలాల పరిధిలో 11 షాపులకు 276 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఘంటసాల మండలంలోని మూడు షాపులకు ఆఫ్ లైన్ ద్వారా 28, ఆన్‌లైన్ ద్వారా 56 దరఖాస్తులు, మొత్తం 84 వచ్చాయన్నారు.



మైఖేల్ సేవలు మరువరానివి



మైఖేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీకి దాసరి కమలప్రసాద్ (మైఖేల్) అందించిన సేవలు మరువరానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మైఖేల్ సంస్మరణ కార్యక్రమాన్ని శారదానగర్‌లోని ఆయన నివాసం వద్ద ఆదివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత జేఏసీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు, 31వ డివిజన్ కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, పార్టీ నాయకులు చాట్రగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.